ప్రజాశక్తి
మంగళవారం 11 జూన్ 2024 5 అనంతపురం





సమావేశంలో పాల్గొన్న అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

# ఒక్కరికే ఛాన్స్..?!



## ◆ రేపే మంత్రివర్గం ఏర్పాటు ◆ 'అనంత' జిల్లాలో పయ్యావులకే దక్కేనా..

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయాన్ని సాధించిన తెలుగుదేశం ప్రభుత్వం రేపు కొలువుదీరనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు ముమ్మరంగా నడుస్తున్న నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణపైనా సర్వత్రా చర్చ నడుస్తోంది. ఎప్పుడూలేని విధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో టిడిపి 13 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలను దక్కించుకోగా, బిజెపి ధర్మవరంలో గెలుపొందింది. దీంతో కూటమి జిల్లాలో క్వీన్ స్వీప్ చేసినట్టయింది. ఇంతమందిలో జిల్లా నుంచి ఎవరికి మంత్రివర్గంలో స్థానం దక్కనుందన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఆశావహులుగా ఉన్న వారు అనేక మందే ఉన్నారు. అనంతపురం జిల్లా వరకు చూస్తే మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఉన్నారు. ఈయనే కాకుండా ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, కళ్యాణదుర్గం నుంచి తొలిసారిగా పోటీ చేసి గెలుపొందిన అమిలినేని సురేంద్రబాబుతోపాటు వైసిపిలో మంత్రివర్గంలో ఉండి టిడిపిలోకి వచ్చిన గుమ్మనూరు జయరాం ఉన్నారు. ఇంతమంది ఒక్క అనంతపురం జిల్లా నుంచే మంత్రివర్గంలో చోటు కోసం ప్రయత్నిస్తున్నవారిలో ఉన్నారు. అయితే ఈసారి పయ్యావుల కేశవ్‌కు మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశాలు ఎక్కువగానున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఎందుకంటే ఎప్పుడు పార్టీ అధికారంలోకి వచ్చినా అక్కడ అభ్యర్థి ప్రత్యర్థి పార్టీ నుంచి ఉండేవారు. తొలిసారిగా అధికారపార్టీకి చెందిన అభ్యర్థే గెలుపొందారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పయ్యావుల కేవవ్ పిఎసి ఛైర్మన్‌గానూ ఉన్నారు. ఆయన ప్రభుత్వాన్ని ఎండగట్టడంలో కీలకంగా వ్యవహరించారు. మంచి వాగ్ధాటి కలిగిన ఆయనకు ఈసారి చోటు దక్కే అవకాశాలు ఎక్కువగానున్నట్టు తెలుస్తోంది.



పయ్యావుల కేశవ్



కాలవ శ్రీనివాసులు




పరిటాల సునీత

సత్యసాయి జిల్లా నుంచి కూడా మంత్రి ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. మాజీ మంత్రి పరిటాల సునీత మరోమారు మంత్రివర్గం చోటు కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఈమెతోపాటు బిసి కోటాలో పెనుకొండ నుంచి గెలుపొందిన సవితమ్మ మంత్రివర్గం రేసులో ఉన్నారు. ఇక కూటమి భాగస్వామ్యంలో భాగంగా బిజెపికి ఐదు మంత్రివర్గ స్థానాలివ్వాలని నిర్ణయం జరిగినట్టు తెలుస్తోంది. ఈ కోటాలో తనకు అవకాశం దక్కుతుందని ధర్మవరం నుంచి గెలుపొందిన సత్యకుమార్ ఆశలు పెట్టుకున్నారు. సత్యసాయి జిల్లాలో ఎవరికి అవకాశాలు ఉండనున్నయన్నది కొంత అయోమయంగానే ఉంది. ఎందుకంటే అనంతపురం జిల్లాలో కమ్మ సామాజిక వర్గం నుంచి కేవశ్‌కు ఇస్తే సత్యసాయి జిల్లాలో ఏ సామాజిక తరగతికి ప్రాధాన్యతనిస్తారన్నది చర్చ నడుస్తోంది. ఒకే సామాజిక తరగతికి ఇవ్వడం సాధ్యమా అన్నది సందేహంగానే ఉంది. ఒకే జిల్లాలో ఒకరికంటే ఎక్కువ మందికి మంత్రివర్గంలో చోటు సాధ్యపడే పరిస్థితులు కనిపించడం లేదు. ఎందుకంటే కూటమిలో భాగంగా అటు బిజెపి, ఇటు జనసేన పార్టీకి తగిన ప్రాధాన్యత కల్పించాల్సి ఉంటుంది. ఈ ప్రాధాన్యతల్లో జిల్లాకు ఒక్కటితోనే సరిపెట్టనున్నారు. ఏది ఏమైనా నేటి సాయంత్రానికి ఎవరికి అవకాశాలుండనున్నాయన్న దానిపై మరింత స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.



సత్య కుమార్



సవితమ్మ

# ప్రభుత్వ సేవలు ప్రజలకు అందాలి

## కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ప్రభుత్వ ఆదేశాలు, ఆకాంక్షలకనుగుణంగా ప్రభుత్వ సేవలను ప్రజలకు సత్వరమే అందించడానికి అధికారులందరూ చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఫ్లడ్ మేనేజ్మెంట్, మొక్కల పెంపకం, ఇంటర్ ఇనిస్టీరిల్ సెంట్రల్ టీం పర్యటన, తదితర అంశాలపై వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలతో సోమవారం నాడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు సంపూర్ణంగా సహకరించిన జిల్లా యంత్రాంగానికి కతజ్ఞతలు తెలియజేశారు. ప్రత్యేకంగా వరద నిర్వహణ (ఫ్లడ్ మేనేజ్మెంట్)కు సంబంధించి మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే విషయమై ఈనెల 13వ తేదీలోపు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. వర్షాకాలంలో విరివిగా మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. అన్ని శాఖల పరిధిలోనూ మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. హెచ్ఎల్‌సి కెనాల్ పరిధిలోని ఉపకాలవల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, డిపిఒతో సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు పరిశుభ్రతా, శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**17న ప్రభుత్వ ఇంటర్ మినిస్టీరియల్ బృందం పర్యటన**

జిల్లాలో ఈనెల 17వ తేదీన కేంద్ర ప్రభుత్వ ఇంటర్ మినిస్టీరియల్ బృందం పర్యటన ఉంటుందని, ఇందుకోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్, డ్వామా శాఖల పరిధిలో గణాంకాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఇంటర్ మినిస్టీరియల్ టీం జిల్లాకు వచ్చిన తర్వాత జిల్లా అధికారులతో ఒక సమావేశం నిర్వహిస్తారని, అనంతరం క్షేత్రస్థాయిలోని విడపనకల్, కనేకల్, తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు, తదితర మండలాల్లో పర్యటించి జిల్లా, మండల, క్షేత్రస్థాయి అధికారులతో సమావేశం అవుతారన్నారు.

**ముఖ్యమంత్రి పర్యటనకు బస్సుల ఏర్పాటు**

ఈనెల 12వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఉంటుందని, ఇందుకోసం జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బస్సులను ఏర్పాటు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లాలో వివిధ ముఖ్యమైన ప్రాంతాల్లో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని లైవ్ స్ట్రీమింగ్ చేయాలన్నారు. జిల్లాలోని ముఖ్యమైన భవనాలను విద్యుత్ దీపాలతో అలకరించాలన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిపిఎం ఆనంద్, ఆర్డీవో వి.శ్రీనివాసుల రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంత బాబు, డిపిఒ ప్రభాకర్ రావు, డిటిసి వీర్రాజు, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రహ్మణ్యం, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, డిఎంహెచ్ఒ డా.ఈబి.దేవితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నీటితో కళకళలాడుతున్న బిటి ప్రాజెక్టు

# కర్నాటకలో విస్తారంగా వర్షాలు

## బిటి ప్రాజెక్టుకి కొనసాగుతున్న వరద

**రాయదుర్గం :** నైరుతి రుతుపవనాలు రాయలసీమను తాకాయి. వీటి ప్రభావంతో ఆదివారం నుంచి రాయదుర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇక కర్నాటక రాష్ట్రంలోనూ విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో దిగువనున్న బిటి ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ప్రాజెక్ట్ ఎత్తు సముద్ర మట్టానికి 1,655 అడుగులు కాగా ఆదివారం 1,644.6 అడుగుల వరకూ నీరు చేరింది. 220 క్యూసెక్కులతో ఇన్ ఫ్లో కొనసాగుతున్నట్లు జల వనరుల శాఖ ఏఈ హరీష్ తెలిపారు.

# కార్మిక ఉద్యమ స్ఫూర్తి 'పర్సా సత్యనారాయణ'

## సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**



'పర్సా' జయంతి ఉత్సవాల కార్యక్రమంలో మాట్లాడుతున్న నరసింగరావు

కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన కార్మిక ఉద్యమాలకు స్ఫూర్తినీయుడుగా పర్సా సత్యనారాయణ నిలిచారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామం అతిథి గహంలో శ్రామిక మహిళ సమైక్య అధ్యక్షురాలు దిల్షాద్ అధ్యక్షతన పర్సా సత్యనారాయణ జయంతి ఉత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఇంతియాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ఆంగ్లేయులు పాలిస్తున్న కాలంలోనే పర్సా సింగరేణి గనుల కార్మికులను కాంట్రాక్టు విధానం నుంచి పరిగణించకుండా పర్మనెంట్ చేయాలని ఉద్యమించారన్నారు. ఆయన ఉద్యోగాన్ని కూడా వదిలి కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసిన యోధుడన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించిన ఆయన జీవితమంతా దాదాపు 72 ఏళ్ల పాటు కార్మిక ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాడే క్రమంలో భాగంగా 9 ఏళ్ల జైలు జీవితం గడిపారన్నారు. రాష్ట్రంలో సిఐటియు వ్యవస్థాపకుడిగా జాతీయ ఉపాధ్యక్షుడుగా పనిచేశారన్నారు. సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా వర్గ పోరాటాలు చేశారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు. పర్సా లాంటి ఎందరో కార్మిక నేతల త్యాగం ఫలితంగా 44 కార్మిక చట్టాలను సాధించుకున్నట్లు తెలియజేశారు. పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి సర్కారు ఆ హక్కులను హరిస్తూ కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. లేబర్ కోడ్‌లను తీసుకురావడానికి పన్నాగం పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్సా ఉద్యమ స్ఫూర్తితో ఆయన ఆశయాలను కొనసాగిస్తూ హక్కుల కోసం ఉద్యమించాలన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ కార్మికుల ప్రయోజనాల కోసమే పర్సా జీవితాంతం పోరాటం చేశారన్నారు. శ్రమ దోపిడీ లేని సమాజం కావాలని, రైతులు ఆత్మహత్యలు చేసుకోని సమాజం కోసం, కార్మికులను గౌరవించే సమాజం కావాలని పరితపించారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు ఏ ప్రభుత్వం అవలంభించినా ఆ ప్రభుత్వాల పతనం కావడం ఖాయమన్నారు. గతంలో చంద్రబాబు, ప్రస్తుతం జగన్ ప్రజల వ్యతిరేకతతోనే గద్దె దిగారని గుర్తు చేశారు.

# నారాయణ పాఠశాలలో పుస్తకాలు సీజ్

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం**

కళ్యాణదుర్గం పట్టణంలోని నారాయణ కార్పొరేట్ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న పుస్తకాలను ఎంఈఓ విజయ్‌కుమార్ సీజ్ చేశారు. ఎంఈఓ సోమవారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమంతనాయుడుతో కలిసి పాఠశాలను సందర్శించారు. సిపిఎం, ఎఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నోట్ పుస్తకాలను పిల్లలకు అంటగట్టి తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యాంగా అడ్మిషన్లు చేసుకోవడంతో పాటు అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. అయితే యాజయాన్యాలు కార్పొరేట్ పాఠశాలల ప్రయోజనాల కోసం అనవసర మైన పుస్తకాలను విద్యార్థులకు అంటగట్టి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపిం చారు. విద్యార్థులకు పంపిణీ చేసేందుకు నోట్ పుస్తకాలను నిల్వ ఉంచిన పాఠశాలలోని ఓ గదిని ఎంఈఓ సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు నవీన్, హర్షవర్ధన్, పవన్, మురళి, సిద్ధూ, హర్ష పాల్గొన్నారు.



నారాయణ పాఠశాలలో పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేస్తున్న ఎంఈఓ విజయ్‌కుమార్

# సమస్యలను పెండింగ్‌లో ఉంచొద్దు

## ఫైళ్లను ఎప్పటికప్పుడు పరిశీలన చేసి పరిష్కరించాలి : కలెక్టర్



కలెక్టరేట్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

కలెక్టరేట్ పరిధిలోని వివిధ విభాగాల్లో ఫైళ్లను ఎప్పటికప్పుడు పరిశీలన చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని ఎ,బి, సి,డి,ఇ సెక్షన్లు, ఎన్నికల సెల్, రికార్డు రూమ్, కెఆర్‌సి రూమ్, భూ సంస్కరణల కార్యాలయాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల ఉద్యోగులందరూ వారి గుర్తింపు కార్డులను తప్పనిసరిగా ధరించాలన్నారు. ఉద్యోగుల సీట్ల వద్ద నేమ్ ప్లేట్లు ఉండాలన్నారు. ఉద్యోగులందరూ కలెక్టరేట్ వాట్సాప్ గ్రూప్‌లో ఉండేలా చూసుకోవాలన్నారు. ఆర్టీఐ యాక్ట్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ నుంచి వచ్చిన ఫైల్స్, కారుణ్య నియామాలకు సంబంధించిన ఫైల్స్, ఇతర ఫైల్స్ వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని రకాల ఫైల్స్‌ను త్వరితగతిన పరిశీలన చేసి పరిష్కరించేలా దృష్టి సారించాలన్నారు. ఎన్‌హెచ్ 544కు సంబంధించి చాలా సమస్యలు వస్తున్నాయని, వాటిని పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. భూ సంస్కరణల కార్యాలయాన్ని కలెక్టరేట్ సెక్షన్‌లోకి మార్పు చేయాలన్నారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ ఆనంద్, కలెక్టరేట్ ఏవో అంజన్ బాబు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, ఆయా సెక్షన్ల డిప్యూటీ తహశీల్దారులు పాల్గొన్నారు.

## నేడు హిందూ మహాగణపతి సమావేశం

**ప్రజాశక్తి-రాయదుర్గం**

రాయదుర్గం పట్టణంలోని నేసేపేట గోసాబావి వీధిలో ఉన్న బృందావనం వద్ద మంగళవారం మధ్యాహ్నం 4 గంటలకు హిందూ మహా గణపతి సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గౌని ప్రతాపరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినాయక ఉత్సవాలను వైభవంగా జరిపేందుకు నూతన కమిటీని ఏర్పాటు చేయాలని ఈ సమావేశం నిర్వహించతలపెట్టినట్లు తెలిపారు. సమావేశంలో ఇది వరకూ ఉన్న కమిటీ సభ్యులతో పాటు కొత్త సభ్యులు కూడా కమిటీలో చేరేందుకు ముందుకు రావాలని ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు. మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా విభాగం కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కావున నూతన కమిటీ ఏర్పాటులో ప్రజలు, యువత భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# అభివృద్ధి, సంక్షేమంతో ముందుకెళ్తాం

◆ వైసిపి పాలనలో రాష్ట్రం పాతికేళ్లు వెనక్కు
◆ అన్ని విధాలా 'పురం'ను అభివృద్ధి చేస్తా
◆ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ
◆ అభిమానుల నడుమ ఘనంగా జన్మదిన వేడుకలు



అభిమానుల నడుమ 64 కిలోల కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ



అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించి మహిళలకు అన్నం తినిపిస్తున్న బాలకృష్ణ

**ప్రజాశక్తి-హిందూపురం**

ఐదేళ్ల వైసిపి పాలనపై ప్రజలు విసుగు చెంది ఎంతో నమ్మకంతో కూటమికి అఖండ విజయాన్ని అందించారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రంలో పాలన సాగిస్తామని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలియజేశారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య తన 64వ జన్మదిన వేడుకలను సోమవారం నాడు ఘనంగా జరుపుకున్నారు. హిందూపురంలోని బాలకృష్ణ నివాసం వద్ద అభిమానుల కోలాహలం నడుమ కేక్ కట్ చేశారు. ముందుగా సుగూరు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద బాలకష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. తన పుట్టిన రోజు సందర్భంగా అన్నా క్యాంటీన్‌ను పున:ప్రారంభించారు. బాలకృష్ణ మహిళలకు అన్నం వడ్డించి వారికి స్వయంగా తినిపించారు. ఎన్టీఆర్ ఆరోగ్య రథంను పున్ణప్రారంభించారు. ఆర్టీసీ ఉద్యోగులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. హిందూపురం జెవిఎస్ ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. అక్కడ 64 కేజీల కేక్‌ను అభిమానుల మధ్య కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూపురం శాసనసభ్యులుగా మూడవసారి గెలిచి హ్యాట్రిక్ సాధించిన వెంటనే తన జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా అభివద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. గత వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి చెందిందన్నారు. వారి ఐదేళ్ల పాలనకు పాతికేళ్లు వెనక్కి వెళ్లామన్నారు. వైసీపీ చేసిన పాపాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. వైసిపి ప్రభుత్వ నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించారని, వారి నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయమన్నారు. హిందూపురానికి పరిశ్రమలు, రింగ్ రోడ్డు, హంద్రీనీవా ద్వారా అన్ని చెరువులకు నీరు, ఎత్తిపోతల పథకం ద్వారా చిలమత్తూరు మండలానికి కష్ణా జలాలను అందించేందుకు కషి చేస్తానన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివద్ధి దిశగా పురోగమిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**బాలయ్య ఇంటి వద్ద అభిమానుల కోలాహలం**

హిందూపురం ఎమ్మెల్యేగా బాలయ్య హ్యాట్రిక్ విజయం సాధించిన తర్వాత జరుపుకుంటున్న పుట్టిన రోజు వేడుక కావడంతో పెద్ద సంఖ్యలో అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. హిందూపురం నుంచే కాకుండా ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు, బాలయ్య అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అభిమానుల నడుమ బాలకృష్ణ కేక్ కట్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డితో పాటు పలువురు అధికారులు బాలకృష్ణకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

**అన్నాక్యాంటీన్, ఎన్టీఆర్ ఆరోగ్య రథం ప్రారంభం**

బాలకృష్ణ తన పుట్టిన రోజు సందర్భంగా హిందూపురంలో అన్నా క్యాంటీన్‌ను పున:ప్రారంభించారు. బాలకృష్ణ మహిళలకు అన్నం వడ్డించి వారికి స్వయంగా తినిపించారు. పేదల ఆకలి తీర్చాలని టిడిపి ప్రభుత్వ హయాంలో అన్నా క్యాంటీన్‌లను ప్రారంభించామన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక వాటిని మూసివేసి పేదల నోటికాడ అన్నాన్ని లాగేసిందన్నారు. పేదల ఆకలి కష్టం తెలిసిన టిడిపి ప్రభుత్వం రాష్ట్రంలోనే మొట్టమొదటిగా అన్న క్యాంటీన్‌ను హిందూపురంలో ప్రారంభించామన్నారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో బాలకష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. అభివద్ధి జరగాలంటే ప్రధానమైనది రవాణారంగం అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా మారిందని విమర్శించారు. గత టిడిపి హయాంలో ఆర్టీసీ బస్సులు వేస్తే హిందూపురం డిపో నుంచి పది బస్సులు చిత్తూరు జిల్లా పుంగనూరుకు తీసుకెళ్లారంటూ మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు యంత్రాంగంలో కదలిక


జెసిబితో పూడికతీత పనులు చేస్తున్న అధికారులు

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

నగర పాలక అధికారులు ఎట్టకులకూ స్పందించారు. జెసిబిలు, హిటాచీలు ఏర్పాటు చేసి నగరంలోని వంకల్లో పూడికతీత పనులు చేపట్టారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంగా నగరంలోని నడిమివంక, మరువవంక పూర్తిగా చెత్తాచెదారాలతో నిండి దుర్గంధం వెదజల్లుతుంటడంతో కలెక్టర్ ఆగ్రహించిన విషయం తెలిసిందే.

వంకలు పూర్తిగా చెత్తాచెదారాలతో నిండి దుర్గంధం వెదజల్లుతూ మురుగునీటి ప్రవాహానికి అవరోధంగా మారినా అటు పాలక వర్గం ఇటు అధికార యంత్రాంగం చోద్యం చూస్తూ ఉండిపోయింది. దీంతో 'స్వచ్ఛంద సుందర అనంత' అటకెక్కినట్లు అయింది. ఈనేపథ్యంలో శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ కలిసి నగరంలోని అధ్వానంగా మారిన పారిశుధ్య పరిస్థితులు వంకలు పూడుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్న వైనంపై సమీక్షలు చేసిన విషయం తెలిసిందే. అలాగే స్వయంగా కలెక్టర్ వినోద్‌కుమార్ రాత్రి 8 గంటల సమయంలో నగరంలోని మరువవంక, నడిమివంకలను పరిశీలించి మున్సిపల్ కార్పొరేషన్ అధికార యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఐఎఎస్ అధికారి మేఘస్వరూప్ ఉన్నప్పటికీ వంకల దుస్థితి పట్టించుకోకపోవడం విశేషం. కలెక్టర్ చొరవ తీసుకుని క్షేత్రస్థాయి పరిశీలన చేసిన తర్వాత కానీ అధికార యంత్రాంగంలో చలనం రాకపోవటం శోచనీయం. వంకల్లో పూడుకుపోయి ఎన్నడూ లేనివిధంగా తెట్టు నిప్పురవ్వలు ఎగిసిపడటంతో అంటుకుని మంటలు వ్యాపించినా మున్సిపల్ కార్పొరేషన్ అధికార యంత్రాంగంలో చలనం రాలేదు. ఈనేపథ్యంలో కలెక్టర్ చొరవతో సోమవారం నుంచి నగరంలోని వంకల్లో చెత్తాచెదారాల తొలగింపు, పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి.

## వంకల్లో పూడికతీత పనులు ప్రారంభం

కాగా భాగంగా వంకల పరిసర ప్రాంతాల్లోని దుకాణాల యజమానులు వ్యర్థాలు, వస్తు సామాగ్రి ప్యాకేజింగ్ వంకల్లో పారవేయకుండా కఠిన చర్యలు చేపట్టాలని నగర వాసులు సూచిస్తున్నారు. లేనిపక్షంలో పూడికతీత ప్రయత్నాలు ప్రధానంగా మారే ప్రహసనంగా మారే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.

# పామిడిలో మోస్తరు వర్షం

**ప్రజాశక్తి-పామిడి**


నేషనల్ హైవేపై సాయికృప లాడ్జి ముందు నిలబడిన వర్షం నీరు

పట్టణంతో పాటు పరిసరాల్లో నాలుగు రోజులుగా ఆకాశం మేఘావతమై తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. అకస్మాత్తుగా వర్షం పడుతుండటంతో ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక పామిడమ్మ ఆలయం సమీపంలో నిలబడిన మురుగుతో పట్టణ వాసులకు ఇబ్బందిని కలిగించాయి. నేషనల్ హైవే 44 సాయికృప లాడ్జి దగ్గర రోడ్డులో వర్షపు నీరు ఎక్కడ వెళ్లడానికి వీలు లేకుండా రోడ్డు మీదే ఆగిపోయింది. స్థానికులు వర్షాలు కురిసిన ప్రతిసారి ఇలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. స్థానిక వెలుగు ఆఫీస్ దగ్గర పామిడి- కల్లూరు రోడ్డు వర్షానికి రోడ్డు మీద నీరు నిలువ ఉండి రాకపోకలకు అధ్వానంగా తయారైంది. పామిడి మండలంలోని వివిధ ప్రాంతాల్లో జల్లులు పడుతుండడంతో మరోసారి వర్షం వేసవి తాపానికి విశ్రాంతినిచ్చింది.

# ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలి

**ప్రజాశక్తి-పుట్లూరు**


మాట్లాడుతున్న ఆత్మ పీడీ మద్దిలేటి

సరైన మెలుకువలు, జాగ్రత్తలను పాటిస్తూ రైతులు ఖరీఫ్ పంట సాగుకు సన్నద్ధం కావాలని ఆత్మ పీడీ మద్దిలేటి, రైతు శిక్షణ కేంద్రం ఎడిఎ శైలజ సూచించారు. సోమవారం స్థానిక పుట్లూరు రైతు భరోసా కేంద్రంలో ఎఒ కాత్యాయనితో కలిసి ఆర్‌బికె సిబ్బంది, రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఏడాది సరైన సమయంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వర్షం నీరు భూమిలోకి ఇంకిపోయేలా రైతులు పొలాలను దుక్కులు చేసుకోవాలని సూచించారు. అలాగే వేరుశనగ, కంది, ఆముదం సాగులో అధిక దిగుబడులు ఇచ్చే మేలైన రకాల విత్తనాలను ఉపయోగించాలన్నారు. సాగుకు ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ పంట సాగులో ఎప్పటికప్పుడు రైతులకు అవసరమైన సూచనలు ఇవ్వాలన్నారు. అనంతరం కలుపు నివారణ, ఎరువుల వినియోగం, పురుగు మందుల వాడకం తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

# కోడ్ ఉంటేనే నిబంధనలా..?!

**ప్రజాశక్తి -అనంతపురం క్రైం**

సార్వత్రిక ఎన్నికలు, కౌంటింగ్ ముగిసేంత వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. కోడ్ ఉన్నంత వరకూ బార్ల యాజమాన్యాలు ఖచ్చితంగా నిబంధనలు పాటించాయి. అయితే కోడ్ ముగిసిన వెంటనే షరా మామూలే అన్నట్లుగా నిబంధనలు తుంగలో తొక్కుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బార్లు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకూ మాత్రమే తెరిచి ఉంచాలి. 11 గంటల అనంతరం గంట పాటు కేవలం భోజనానికి మాత్రమే అనుమతి ఉంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంత వరకూ ఈ నిబంధనలను అన్నీ పాటించారు. ఎన్నికల కోడ్ ముగుస్తానే నిబంధలన్నీ తుంగలో తొక్కారు. అసలు బార్ల వెనుక ఉన్న రహస్య శక్తి రాజకీయ నాయకులా.. అధికారుల మామూళ్లా.. అనేది అర్థం కావడం లేదనే చర్చ సాగుతోంది. కోడ్ అమల్లో ఉన్నన్ని రోజులు ఊరి బయట ముళ్ల పొదల్లో మద్యం తాగుతున్నా పట్టుకొచ్చి పోలీసులు కేసులు నమోదు చేశారు. అయితే కోడ్ ముగియగానే రోడ్డుక పక్కనే మద్యం తాగుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార యంత్రాంగం నిద్ర పోతోందా? లేక మామూళ్ల మత్తులో జోగుతోందా? అని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**నిబంధనలను పాటించని బార్ల యజమానులు**

**ఎక్కడ పడితే అక్కడ తాగుతున్న మందుబాబులు**

**నిద్రపోతున్న అధికార యంత్రాంగం**


కిరాణా దుకాణం ముందు మద్యం తాగుతున్న వ్యక్తి

## ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌కు శుభాకాంక్షలు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

**పామిడి :** నూతనంగా ఎన్నికైన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌ను సోమవారం ఆలూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా బొకేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు ఆవుల శివ, నిమ్మకాయల శీన, నిమ్మకాయల ప్రసాద్, 3వవార్డు పురుషోత్తం, గోవిందు, కాలాపురం సుంకిరెడ్డి, సోము, కాలాపురం నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలయ్య జన్మదిన వేడుకలు


రోగులకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న అభిమానులు

**శింగనమల :** ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వాసుపత్రిలో రోగులు, అనాథ పిల్లలకు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందమూరి బాలకృష్ణ అటు రాజకీయాలు, ఇటు సినీ రంగాల్లో ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఆయా రంగాల్లో ప్రజలతో మమేకమై వారి కష్టాలు తెలుసుకుంటూ ముందుకు సాగి మూడవసారి అసెంబ్లీలో అడుగుపెడుతుంటం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాయల రమణయాదవ్, ముచ్చుకోట శివయ్య, నాగప్ప, తలారి ఆదినారాయణ, చెన్నయ్య, ప్రతాప్, నారాయణస్వామి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**గుత్తి :** హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు సోమవారం గుత్తిలో జరిగాయి. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో టిడిపి నాయకులు కేకు కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు అధ్యక్షులు అబ్దుల్‌జిలాన్, సర్పంచి భరత్‌కుమార్, టిడిపి నాయకులు ఎంకె.చౌదరి, ఎన్.కేశవనాయుడు, పి.నారాయణస్వామి, దిల్కాశీనా, మోడే శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌చౌదరి, ఎ.పులికొండ, బోర్‌వెల్ నాగరాజు, ఆది, తదితరులు పాల్గొన్నారు.

## 67,673 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ

**అనంతపురం :** జిల్లావ్యాప్తంగా సోమవారం నాటికి 73,456 మంది రైతులకు 67,673 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ కాయలు పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 79,522 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా అందుకు అనుగుణంగా వేరుశనగ కాయలు సిద్ధం చేసినట్లు తెలిపారు.









# మధ్యాహ్న భోజన ఏజెన్సీలను కొనసాగించాలి

## సిపిఎం, సిఐటియు నేతల వినతి


వజ్రకరూరులో ఎంఇఒకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి-వజ్రకరూరు**

పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులను యథావిధిగా కొనసాగించాలని సిపిఎం మండల కన్వీనర్ వినుపాక్షి డిమాండ్ చేశారు. సోమవారం వజ్రకరూరు కార్యాలయంలో ఎంఇఒ ఎర్రిస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడు మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు, శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్‌మెన్లను తొలగించడం సమంజసం కాదన్నారు. ఏజెన్సీ నిర్వాహకులను మార్చడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించారన్నారు. కొన్ని సంవత్సరాలపాటు చాలీచాలని జీతాలతో విధులు నిర్వహించినట్లు గుర్తుచేశారు. అలాంటి ఏజెన్సీ కార్మికులను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు రంగమ్మ, సుంకమ్మ, లక్ష్మీదేవి, సల్మా, బావమ్మ, సుజాత, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు :** జిల్లావ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులతోపాటు ఎండిఎం హెల్పర్స్, వాచ్‌మెన్లను యథావిధిగా కొనసాగించాలిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు రమాదేవి డిమాండ్ చేశారు. సోమవారం ఆత్మకూరు మండలం కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి నర్సింహారెడ్డికి సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు అతి తక్కువ ఖర్చుతో పిల్లలకు భోజనం చేసి పెడుతున్నారన్నారు. ఈ సమయంలో ప్రభుత్వం మారడం వల్ల వారికి కూడా మారుస్తారని భయాందోళన చెందుతున్నారన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్న భోజన కార్మికులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎండిఒ వర్కర్లను తొలగించొద్దన్నారు. శానిటైషన్ వర్కర్లకు రూ.వెయ్యి ఇస్తున్నా పని చేస్తున్నారన్నారు. అదేవిధంగా నైట్ వాచ్‌మెన్లకు నెలనెలా కొద్ది వేతనాలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. కావున వారందరికీ వేతనాలు పెంచడంతోపాటు వారందరినీ యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకురాలు జయమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.రామయ్య, నాయకులు సోమశేఖర్, రాజేందర్, మహేష్, సుబ్బమ్మ, లక్ష్మీదేవి, మీనాక్షి, లక్ష్మి, లక్ష్మక్క, కృష్ణవేణి, సుబ్బలక్ష్మి, మారక్క, సతీష్, బేబీ ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరులో ఎంఇఒకు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

## 'దగ్గుపాటి'కి ఘనస్వాగతం


కేక్ కోస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి దంపతులు

**అనంతపురం కలెక్టరేట్ :** ఎన్నికల్లో విజయం తర్వాత అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తొలిసారిగా తన సొంత పరిశ్రమకు వెళ్లడంతో ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. దగ్గుపాటి ప్రసాద్ హైదరాబాద్‌లోని డీవీ పాలిమర్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ ద్వారా ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఎన్నికల్లో రెండు నెలల పాటు బిజీ బిజీగా గడిపిన దగ్గుపాటి.. విజయంతో తన సొంత పరిశ్రమలో అడుగుపెట్టారు. దీంతో అక్కడ పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. ఈ సందర్భంగా భారీ కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. పూలహారాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్మికులతో కలసి దగ్గుపాటి దంపతులు తమ ఆనందాన్ని పంచుకున్నారు. తన కష్టం, సుఖం, సంతోషంలో కార్మికులు, ఉద్యోగులు ఎంతో తోడుగా ఉన్నారన్నారు. ఈ విజయంలో వారికి కూడా భాగం ఉందన్నారు. తన మంచి కోరుకునే వారు ఇంత మంది ఉన్నారు కాబట్టే..తనకు విజయం వరించిందన్నారు. తనవెంట నడుస్తున్న కార్మికులు, ఉద్యోగుల్ని ఎప్పటికీ మరువలేమన్నారు.

# ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం

## యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

సమిష్టిగా పోరాడి ప్రభుత్వ విద్యారంగాన్ని బాధ్యతతో కాపాడుకుందామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా జీవో 117ను రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న వేలాది పోస్టులు, 25వేలకుపైగా ఉపాధ్యాయు పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని, 3,4,5 తరగతుల విలీనాన్ని రద్దు చేయాలని, 1998, 2008 టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని, సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన అనేక యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ గత ఐదేళ్లలో విద్యారంగంతోపాటు ఉపాధ్యాయ వర్గానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. గతంలో పరిష్కరించలేని సమస్యలన్నింటినీ ఉపాధ్యాయ సంఘాలతో సంప్రదించి చర్చించి వెంటనే పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసేందుకు నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కాగా జిల్లావ్యాప్తంగా యుటిఎఫ్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, సహాధ్యక్షులు రామప్ప, సరళ, జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, జిల్లా కార్యదర్శి ప్రమీల, అర్జున్, సంజీవ్‌కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

## ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారం

**ప్రజాశక్తి-నార్పల**

మండలంలోని అన్ని సచివాలయాల్లో ఈనెల 12న బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపిడిఒ రాముడు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు ఇఒఆర్‌డి శైలజారాణి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోను తప్పనిసరిగా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రత్యక్ష ప్రచారం చేసి చూపించాలన్నారు. అనంతరం స్థానిక బాలికల పాఠశాలలోని ఆడిటోరియంలో ఏర్పాట్లను తహశీల్దార్ లక్ష్మీనారాయణతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలోని విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

**శింగనమల :** ఈనెల 12వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని మండలంలోని అన్ని సచివాలయాల్లో ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపిడిఒ బివి రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద లైవ్ స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలిపారు.

## ఎంసిఎ ఫలితాలు విడుదల

**అనంతపురం :** జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎంసిఎ 4వ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంపిఎ 5వ సెమిస్టర్ (ఆర్17), ఎంసిఎ 4వ సెమిస్టర్ (ఆర్17), ఎంసిఎ 3వ సెమిస్టర్ (ఆర్ 21), (ఆర్20), (ఆర్17) సప్లిమెంటరీ, ఎంసిఎ 4వ సెమిస్టర్ (ఆర్20), (ఆర్17) సప్లిమెంటరీ, ఎంబిఎ 4వ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంబిఎ 4వ సెమిస్టర్ (ఆర్17), ఎంబిఎ 3వ సెమిస్టర్ (ఆర్21), (ఆర్17) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntua.ac.inను సంప్రదించాలని కోరారు.

## రిటైర్డ్ టీచర్‌కు సన్మానం

**బెలుగుప్ప :** ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు బూలగుండ్ల ఈశ్వరప్ప దంపతులను సోమవారం మండల కేంద్రంలోని వాసవీ కళ్యాణ మండపంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈశ్వరప్ప శెట్టూరు, ఉరవకొండ, బెలుగుప్ప మండలాల్లో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించి విద్యార్థులు, ఉపాధ్యాయుల మన్ననలు పొందారన్నారు. ఎంతో బాధ్యతాయుతంగా విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పి ఉన్న స్థానాలకు చేరుకునేందుకు ఎంతో కృషి చేశాడని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పి.మల్లారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటేశులు, ఎల్.లక్ష్మీనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, వేణుగోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.నాగరాజ, సన, బస్సి విఠల్, మారెన్న, త్రిలోకనాథ్‌రెడ్డి, పాటిల్ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

**ప్రజాశక్తి-వజ్రకరూరు**

గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వెంకటేష్‌నాయక్ సూచించారు. సోమవారం రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 36 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వారితో సమావేశం ఏర్పాటు చేసి వారికి ఆరోగ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు సరైన పోషకాహారం తీసుకుంటే రక్తహీనత నుంచి కాపాడుకోవచ్చన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ వైద్యుల సలహాలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు చేస్తున్నారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే కీల్కారి మొబైల్ వైద్య సలహాలను వినియోగించుకోవాలన్నారు. అయోడిన్ ఉన్న ఉప్పునే వాడాలని కోరారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉండటంతో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇకపోతే గర్భిణులు లింగనిర్ధారణ పరీక్షలు చేయించుకుని భ్రూణహత్యలకు పాల్పడితే శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, సిహెచ్ఒ నాగరంగయ్య, సూపర్‌వైజర్ స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌ఒలు భారతి, నాగసురేఖ, హెబ్సిబా, రూపా, స్టాఫ్‌నర్సు సునీత, ల్యాబ్ టెక్నీషియన్ రాణి, ఎఎన్ఎంలు చాముండేశ్వరి, కోమల, లలిత, సీఓ.భగవాన్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా విత్తనాలు పంపిణీ

**గుత్తి :** మండలంలోని కరిడికొండ గ్రామంలో సోమవారం రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఎస్సీ రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేశారు. షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎస్సీ రైతులకు రెండు కిలోల కందులు, రెండు కిలోల సజ్జల విత్తనాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు నటరాజ్, లక్ష్మణ్, మాధవీలత మాట్లాడుతూ భవిష్యత్తులో పంటల సాగుపై రైతులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. పంటల సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు అజేయుడు, టిడిపి నాయకులు జక్కలచెరువు ప్రతాప్, పి.రవితేజ, ఎన్.ప్రభాకర్ నాయుడు, రమేష్, చెన్నకేశవులు, ఎస్.సుధాకర్‌నాయుడు, కేశవులు స్వామి, తదితరులు పాల్గొన్నారు.